ప్రతి ఒక్కరికీ 'సురక్ష' వైద్యం

- ఎమ్మెల్యేలు శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి
- ఊరూరా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

నంద్యాల టౌన్: ప్రజల ఇంటి ముంగిటకే మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష అనే చరిత్రాత్మకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని గాంధీ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. వైద్యం కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్ ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి పేదవానికి ఆరోగ్య రక్షగా నిలుస్తుందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారు స్పెషలిస్ట్ డాక్టర్ల చేత పరీక్షలు చేయించుకుని వారి సూచనల ప్రకారం మందులు వాడుతూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. శిబిరంలో 1050 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 38 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్య శ్రీ నెట్వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి, ఎంహెచ్‌ఓ అంకి రెడ్డి, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సీసీలియ పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాలకు స్పెషలిస్టు వైద్యులు

చాగలమర్రి: రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు స్పెషలిస్టు వైద్యులను పంపి ప్రత్యేక వైద్యాన్ని నిరుపేద ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండలంలోని నేలంపాడు గ్రామ సచివాలయంలో గురువారం ఎంపీడీఓ మహబూబ్ దౌలా, ప్రభుత్వ వైద్యులు షేక్.ఇమ్రాన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో ఉన్న ప్రజల ఆరోగ్యం పట్ల ఏ ముఖ్యమంత్రి కూడా ఇంత శ్రద్ధ తీసుకోలేదన్నారు. కంటి పరీక్ష చేయించుకొని శిబిరాన్ని ప్రారంభించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. శిబిరంలో వైద్యులు 450 మందికి వైద్యసేవలు అందజేశారు. 16 మందికి కళ్ల జోళ్లను ఎమ్మెల్యే అందజేశారు. 28 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్కు ఆసుపత్రులకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్.బాబులాల్, ఎంపీపీ వీరభద్రుడు, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ బేబమ్మ, వార్డు సభ్యులు వి.మహబూబ్ షరీఫ్, ముల్లా.బురాందీన్, నాయకులు ముల్లా.ఖాదర్‌బాషా, తహసీల్దారు సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు

నంద్యాల(అర్బన్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ ఉచిత వైద్య పరీక్షలు అందుతున్నాయని, నంద్యాల నియోజకవర్గ ప్రత్యేక అధికారి డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని పుసులూరు గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సందర్శించారు. 586 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, సర్పంచ్ రామసుబ్బయ్య, ఈఓఆర్‌డీ మహిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష

గోస్పాడు: పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారని వైస్ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కానాలపల్లె గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరంలో 499 మందికి వైద్య పరీక్షలు చేసి 42 మందిని రెఫరల్ చేశారు. సర్పంచ్ లింగమ్మ, ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

దొర్నిపాడు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలనే సంకల్పంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తీసుకొచ్చారని ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రం దొర్నిపాడు సచివాలయం–2లో సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు 546 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, గ్రామ సర్పంచి సానికాదేవమణి, నాయకులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండల పరిధిలోని మందలూరులో గురువారం ఎంపీడీఓ మదు సూధనరెడ్డి, తహసీల్దార్ రవీంద్ర ప్రసాదు, సర్పంచ్ నిర్మలమ్మ, మండల ఉపాధ్యక్షుడు వీర శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం విజయవంతమైంది. మందలూరు, చందలూరు గ్రామాలకు చెందిన 767మందికి డాక్టర్లు గాయిత్రి, బాబు, తేజా, దిలీప్ కుమార్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



వైద్యం కోసం వచ్చిన మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి ,



నేలంపాడులో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ సహాయకురాలు సౌజన్య



నేలంపాడులో మందులు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ



రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు



మందలూరులో వృద్ధుడికి ఈసీజీ వైద్య పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

హెల్త్ క్యాంప్‌తో భయం తొలగింది



ఏదైనా ఆందోళనకు గురైనప్పుడు గుండె వేగంగా కొట్టుకునేది. దీంతో ఎక్కడ గుండెపోటు వస్తుందో అని పరీక్షలు చేయించుకోవాడినికి కూడా భయపడేవాడిని. బయట ఈసీజీ తీయించుకోవాలంటే రూ.500నుంచి రూ.800 వరకు తీసుకునేవారు. దీంతో డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో జగనన్న ఆరోగ్య సురక్షలో ఉచితంగా ఈసీజీ చేశారు. ఎలాంటి ఇబ్బంది లేదని సూచించడంతో భయం తొలగింది.

– బాల ఉసేని, దొర్నిపాడు

సురక్ష వైద్య శిబిరం మాకు వరం



కొంత కాలం క్రితం నాకు పక్షవాతం వచ్చింది. లేచి నడవలేని స్థితి. దీనికి తోడు షుగర్ కూడా ఉండటంతో వీల్ చైర్లో ఆసుపత్రుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడేవాడిని. ఇపుడు జగన్న ఆరోగ్య సురక్ష తో ఇంటివద్దకే వచ్చి టెస్టులు చేశారు. ఇంటికి దగ్గరలో ప్రభుత్వమే వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా ఇవ్వటం వల్ల ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవస్థ తప్పింది. మా దగ్గరికే వైద్యులను పంపి వైద్య అందిస్తున్న సీఎం జగన్ చల్లగా ఉండాలి.

–వీరయ్య, క్రాంతి నగర్

క్లుప్తంగా

కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు

నంద్యాల(అర్బన్): ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాల వల్ల ప్రమాదాలను నివారించేందుకు కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ డి–2 ఏఈ రామయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ రహదారి క్రాసింగ్‌లు, వైర్లు కిందకు రావడం, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు 26 స్తంభాలు అవసరం కాగా, ప్రస్తుతం 16 కొత్త స్తంభాలను ఏర్పాటు చేశామని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు.

15 నుంచి దసరా శరన్నవరాత్రులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవ నగర్‌లో వెలసిన రామాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఈనెల 15 ఆదివారం నుంచి ప్రారంభమై 23వ తేదీ సోమవారం వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాసులు తెలిపారు. గురువారం శ్రీభగవత్ సేవా సమాజ్ వారి ఆధ్వర్యంలో ఆలయ దసరా నవరాత్రుల సావనీరు కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, వస్త్రాల అలంకరణ సేవలు, సాయంత్రం వేదిక అలంకార పూజలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. దుర్గాష్టమి రోజున చండీ హోమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్యదర్శి మధు, శ్రీనివాస్, చక్రపాణి పాల్గొన్నారు.

రోడ్లపై సంచరించే ఆవులను గోశాలకు తరలిస్తాం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, డీఎస్పీ మహేశ్వరరెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలో రోడ్లపై సంచరిస్తున్న గోవులను ఆదివారం నుంచి గోశాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో పట్టణ డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గోవుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారంలోగా పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న గోవులను యజమానులు రోడ్ల పైకి రాకుండా ఇళ్లలో సంరక్షించుకోవాలన్నారు. సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

రోటరీ క్లబ్ సేవలు విస్తరించాలి



ప్లేట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల చేస్తున్న సేవలు మరింత విస్తరించాలని మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని పోలూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల ఆధ్వర్యంలో గురువారం 300 ప్లేట్లను అందించారు. క్లబ్ అధ్యక్షుడు దండె దస్తగిరి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో దాతలు రామచంద్రారెడ్డి, రమేష్, సత్యనారాయణ, చెన్నకేశవరెడ్డి, మధుసూదన్, రాధిక, క్లబ్ కార్యదర్శి ప్రసాదరెడ్డి, బాలకృష్ణ, హెచ్‌ఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో ఆలోచనా శక్తి పెంపు

నంద్యాల(న్యూటౌన్): క్విజ్ పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక, ఆలోచన శక్తి, ఆత్మస్థైర్యాన్ని నింపవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక డీఈఓ కార్యాలయంలో కౌశల్ సైన్స్ క్విజ్ పోటీల పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ భారతీయ విజ్ఞాన మండలి అఫ్కా స్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జరిగే పోటీల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల్లో చదువుతున్న 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనాలన్నారు. హెచ్‌ఎంలు విద్యార్థులను సంసిద్ధులను చేసి వివరాలను వెబ్‌సైట్‌లో నవంబర్ 5వ తేదీ లోపు నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి సుందర్‌రావు, శేఖర్‌రెడ్డి, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్, సర్వశిక్ష అభియాన్ కో ఆర్డినేటర్ రఘురామిరెడ్డి, ఎంఈఓ గంగాధర్ పాల్గొన్నారు.

వైభవంగా జమాలుద్దీన్ బాషా ఉరుసు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా జమాలుద్దీన్ బాద్‌షా చిత్తవుల్‌ఖాద్రి దర్గా 749వ ఉరుసు మహోత్సవ వేడుకలను దర్గా నిర్వాహకులు ముతవల్లి సయ్యద్ హారూన్ బాషా నిజామీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం ప్రత్యేక పాతెహాలు, మధ్యాహ్నం కిస్తీలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం జీయారత్ ఫాతేహ వేడుకలను నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేరోజు రాత్రి గుజరాత్, ముంబాయి వారిచే ఖవాళి ఉంటుందన్నారు. కార్యక్రమంలో దర్గా ఖాజామొహిద్దీన్, దర్గా రసూల్, దర్గా జాహిద్‌హుసేన్, దర్గా జాఫర్ హుసేన్, దర్గా నూర్‌బాషా, దర్గా ఇసాక్, యూసుఫ్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం

- రూ.20 లక్షలతో రెండు సీసీ రోడ్ల నిర్మాణం
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



3వ వార్డులో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణం ఓల్డ్ టౌన్ 3వ వార్డులో ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని రహదారి సమస్యను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పరిష్కరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా రూ.20లక్షలతో సీసీ రోడ్లను వేయించారు. గురువారం నూతన సీసీ రోడ్లను వార్డు కౌన్సిలర్ అబ్దుల్ సమ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ఎన్నడూ లేని విధంగా ఇరుకు సందులలో సీసీ రోడ్లను వేసి రహదారులకు అనుసంధానం చేస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, నంద్యాల పట్టణ అధ్యక్షుడు పడకండ్ల సుబ్రహ్మణ్యం, జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్లు కలాంబాషా, ఆరిఫ్ నాయక్, తబ్రేజ్, సాదిక్‌బాషా, కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా తదితరులు పాల్గొన్నారు.

మంచి చేస్తున్నాం కాబట్టే గడపగడపకు వెళ్తున్నాం

అవ్వా ఎలా ఉన్నావ్ ఆరోగ్యం బాగుందా.. తాత పింఛన్ ఒకటో తారీఖున అందుతుందా, వలంటీర్ ఇంటికి వచ్చి మీకు సేవలు అందిస్తున్నారా..! అంటూ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకుసాగారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 27వ వార్డు దేవనగర్–2లో వార్డు ఇన్‌చార్జ్ బాషా, కో ఆప్షన్ సభ్యురాలు శోభారాణిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ.. వార్డులో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య, శానిటేషన్, కరెంట్, ఇతర సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు మంచి చేయడానికి ఈ ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు. ప్రతి గడపకూ మంచి చేస్తూ వారి అభ్యున్నతికి పాటు పడే ముఖ్యమంత్రిని మరోమారు ఆశీర్వదించి ఓటు వేసి గెలిపించి ఆంధ్రరాష్ట్ర అభ్యున్నతిలో పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంశావలి, నాయకులు పున్న శేషయ్య, జాకీర్‌హుస్సేన్, టి.వి. రమణ, కౌన్సిలర్లు మేస చంద్రశేఖర్, సాదిక్‌బాషా, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునీతఅమృతరాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి, లక్ష్యం మేరకు ఫలితాలు సాధించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను సూచించారు. గురువారం మధ్యాహ్నం వ్యవసాయం, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్మెంట్, రెవెన్యూ, రీసర్వే, జాతీయ రహదారులకు భూ సేకరణ, ఎంపీఎఫ్‌సీ గోడౌన్‌లకు భూ కేటాయింపు, ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీలో వేజ్ జనరేషన్, జల్ జీవన్ మిషన్, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆత్మకూరు ఆర్‌డీఓ కార్యాలయం నుంచి ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, కలెక్టరేట్ ఛాంబర్ నుంచి డీఆర్‌ఓ పుల్లయ్య ఇతర జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

పోషకాహారం.. ఆరోగ్యానికి సహకారం



ఫుడ్ బాస్కెట్‌ను అందజేస్తున్న జిల్లా రైతు సాధికార సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ నరేంద్రరెడ్డి

ఆళ్లగడ్డ : పోషకాలతో కూడిన భోజనం చేసినప్పుడే చిన్నారులు ఆరోగ్యంగా పెరుగుతారని, గర్భిణులు రక్తహీనత లేకుండా ఉంటారని జిల్లా రైతు సాధికార సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ నరేంద్రరెడ్డి అన్నారు. ఆరోగ్యం... పోషణ కార్యక్రమంలో భాగంగా గురువారం అహోబిలం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫుడ్ బాస్కెట్ (ఆహార బుట్ట) అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు. ఎన్‌ఎఫ్‌ఏ మార్కెటింగ్ జిల్లా మేనేజర్ రవీంద్ర మాట్లాడుతూ జిల్లాలోని ప్రకృతి వ్యవసాయం ద్వార పండించిన ఉత్పత్తులను ప్రెసెసింగ్ విలువ జోడించి అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ చేసుకునేందుకు ధ్రువీకరణ పత్రం అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లాలోని సర్టిఫైడ్ రైతుల దగ్గర సేకరించిన గ్రామంలో పండని 16 రకాల ఉత్పత్తులను ఫుడ్ బాస్కెట్ కింద అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం మహమ్మద్, సత్యరాజ్, వరలక్ష్మి, శైలజ, నరేంద్ర, పుల్లయ్య పాల్గొన్నారు.

ఈ–శ్రామ్ కార్డుకు నమోదు చేసుకోవాలి

గోస్పాడు: ఇప్పటి వరకు నమోదు చేసుకోని వారందరూ ఈ–శ్రామ్ కార్డుకు నమోదు చేసుకోవచ్చని సహాయ కార్మిక అధికారి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం గోస్పాడులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అసంఘటిత కార్మికుల కోసం ఈ–శ్రామ్ కార్డును అందజేస్తుందన్నారు. ఒక్క సారి నమోదు చేసుకుంటే ఆధార్ కార్డు లాగా జీవిత కాలం పని చేస్తుందని తెలిపారు. గోస్పాడు, శిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల పరిధిలో 40వేల ఈశ్రామ్ కార్డులు ఉన్నట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, వలస కార్మికులు, రిక్షా తొక్కే వారు, ఇళ్లలో పని చేసే వారు, మత్స్య కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధి హామీ కూలీలు, చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారుల అర్హులన్నారు. వీటి వల్ల సామాజిక భద్రత, ఇతర సంక్షేమ పథకాల అమలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షలు ఆర్థిక సహాయం వచ్చే అవకాశం ఉందన్నారు. పూర్తి అంగవైకల్యం కలిగిన వారికి రూ.2లక్షలు, పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ.లక్ష బీమా సదుపాయం ఉంటుందని చెప్పారు. ఈ శ్రామ్ కార్డు పొందాలనుకునే వారు ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నంబరు తదితర వివరాలతో సమీన గ్రామ, వార్డు సచివాలయాలు, కామన్ సర్వీసు సెంటర్‌లో ఉచితంగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

నేడు ఎమ్మెల్యే రాక

శిరివెళ్ల: మండల కేంద్రం శిరివెళ్లకు ఈ నెల 13వ తేదీన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రానున్నట్లు వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం గురువారం తెలిపారు. మన బడి నాడు– నేడు కింద జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ. 75 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): ఏపీ మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికుల నూతన కమిటీని స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య తెలిపారు. అధ్యక్షుడిగా రంజిత్, ఉపాధ్యక్షులుగా మంగమ్మ, చిన్నమ్మ, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్, సహాయ కార్యదర్శులుగా లలితమ్మ, శివరాముడు, కోశాధికారిగా మద్దయ్యతో పాటు 21మందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

పుల్లయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): గోరుకల్లు నుంచి బేతంచెర్ల వరకు వాటర్ సరఫరా చేయడం కోసం చేపట్టిన ప్రాజెక్టులో మెగా ప్లాంట్ మేనేజర్‌గా పని చేస్తున్న ఇంజినీర్ చిన్నపుల్లయ్య విధులు ముగించుకొని వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులు గౌస్, బాల వెంకట్ అన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి యాజమాన్యం రూ.50లక్షలు ఇవ్వాలని,. పిల్లలకు చదువు పూర్తయ్యే వరకు యాజమాన్యమే బాధ్యత తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, చిన్నపుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు పూర్తిగా అవగాహన కల్పించి, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలని ఎస్‌ఈఆర్‌పీ విజయవాడ ప్రత్యేక అధికారి సుధాకర్‌రావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో జిల్లా మహిళా సమాఖ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా గ్రామైక్య సంఘాల సమావేశాలు నిర్వహించుకోవాలని, సీసీలు, ఏపీఎంలు తప్పకుండా హాజరు కావాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్, బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు 100శాతం రికవరీ జరిగేలా చూడాలన్నారు. డీపీఎం దానం, డీపీఎంయూ యాంకర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్, ఏపీఎం ఎల్లయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఆళ్లగడ్డ: మండలంలోని పేరాయిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మహబూబ్‌బాషా తెలిపారు. గురువాం స్థానిక పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు భారతి (యోగా), చరన్‌కుమార్, శరత్‌కుమార్ (బేస్‌బాల్) కాశీవిశ్వనాథ్ (సాఫ్ట్ బాల్), సుజాత, మహబూబ్‌బీ (తైక్వాండో)లను అభినందించారు. ఉపాధాయులు సీతారామయ్య, శేషశయనారెడ్డి, పాషావలి, పద్మావతి పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన క్విజ్, చిత్రలేఖనం పోటీల్లో గురురాజ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు డైరెక్టర్ షేక్షావలిరెడ్డి గురువారం తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన సబ్ జూనియర్ పోటీల్లో మొదటి బహుమతి సాధించిన నాగమనోజ్, సీనియర్ కేటగిరిలో ద్వితీయ బహుమతి సాధించిన సుబ్బరాయుడులను అభినందించారు.

చెప్పినవి.. చెప్పనివి చేసిన ఏకైక ప్రభుత్వం

- గడప గడపలో అడుగడుగునా ప్రజల నీరాజనం
- సమస్యలు వింటూ అక్కడిక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగిన ఎమ్మెల్యే



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ఏ ప్రభుత్వం చేయని విధంగా ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవి.. చెప్పనివి కూడా అమలు చేసి ప్రజల మద్దతు వంద శాతం పొందిన ఏకైన ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. రూరల్ మండలం కోటకందుకూరు గ్రామంలో గురువారం ఎమ్మెల్యే నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. గ్రామంలోని ప్రజలు వర్గాలు, పార్టీలకతీతంగా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడపగడపకూ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? పింఛన్ ఇంటిదగ్గరకే వచ్చి ఇస్తున్నారా.. అని ఆరా తీశారు. ప్రజలు విన్నవించిన సమస్యలకు అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపిస్తుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలు అమలు చేసి ప్రజల మన్ననలను అందుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఆయన వెంట ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ దాదాపీర్, సర్పంచ్ లక్ష్మీ, నాయకులు రామకృష్ణ, కొలిమిబాషా, గోపాల్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరిలో సీఎం సహాయనిధి ధీమా

నిరుపేదల వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ఉందనే ధీమా ప్రతి ఒక్కరిలో ఉందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. జక్కుల లక్ష్మీదేవి రూ. 65,000, దండెకేశవమ్మ రూ. లక్ష, గురుజాల వెంకటలక్ష్మీదేవి 1.30 లక్షలు, పోచన గోపాల్‌రెడ్డి రూ. 65,000, సత్తుహరు పిచ్చమ్మ రూ. 55,000, కందుకూరు నాగమ్మ రూ. 60,000, కుంతకట్ల రాము రూ. 55,000, నెల్లాబోయిన నాగేశ్వరమ్మకు రూ. 60,000 చొప్పున చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

మాటకు కట్టుబడి పనిచేస్తున జగనన్న

చాగలమర్రి: ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తున ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నేలంపాడు, రాంపల్లె, పెద్దబోదనం గ్రామాలలో రూ.2.50 కోట్లతో నిర్మించిన సచివాలయ, ఆర్‌బీకే, ఆయుష్మాన్ భారత్ నిర్మాణ్ భవనాలు, సీపీ, బీటీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్.బాబులాల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, ఎంపీపీ వీరభద్రుడు, తాలూకా నాయకుడు నరసింహారెడ్డి, నాయుడు, ఎంపీటీసీలు పత్తినారాయణ, బేబమ్మ, నరసింహుడు, సర్పంచ్‌లు ప్రతాప్‌రెడ్డి, శివమ్మ, యామ నర్సమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న గంధం రాఘవరెడ్డి

ఆళ్లగడ్డ : వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి పాలకమండలి సభ్యులు, సిబ్బంది అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని చైర్మన్ గంధం రాఘవరెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గురువారం సెక్రటరీ నారాయణస్వామి అధ్యక్షతన పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డ్‌ను అన్ని విధాల అభివృద్ధి చేసి జిల్లాలో ఆదర్శవంత మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రెండు రూపాయల బాడుగతో రైతులు దాన్యం నిల్వ చేసుకునేందుకు తీర్మానం చేసి ఆమోదించడం జరిగింది. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ నరహరి ఉన్నారు.

హెపటైటిస్‌పై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): స్థానిక రామకృష్ణ అటానమ్ డిగ్రీ కళాశాలలో గురువారం హెపటైటిస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిస్సిప్రియ, సచిన్, కిరణ్మయి పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికకు 200మంది హాజరు..

రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 200 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారని కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రంలో కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ ప్రశాంత్, నాగేశ్వరరావు, విశ్వంస, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

దంపతులపై టీడీపీ నాయకుల హత్యాయత్నం

బొమ్మలసత్రం: కొత్తపల్లి గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి, మూనికలు దంపతులకు చెందిన స్థలం తమదంటూ అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మోహన్‌గౌడ్, రమణయ్యగౌడ్, గోవర్ధన్‌గౌడ్‌లు వారితో గొడవపడ్డారు. ఈ క్రమంలో గురువారం సుదర్శన్‌రెడ్డితో పాటు ఆయన భార్య మౌనికపై కర్రలతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇద్దరి తలపై బలంగా మోదటంతో తీవ్రగాయాలపాలయ్యారు. గాయపడిన దంపతులను స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అంతర్జాతీయ స్థాయిలో పతకాలు



క్రీడాకారులను సత్కరించిన దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్నేషనల్ పవర్‌లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ ఈవెంట్‌లలో నంద్యాల జిల్లా కాళికాంబా దేవస్థాన హనుమాన్ వ్యాయామ శాల క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారని గణేష్ సమితి నిర్వాహకులు నిమ్మకాయల సుధాకర్, చందామోహన్, వైవీ రమణ, శిక్షకుడు, పుల్లయ్య గురువారం తెలిపారు. నేపాల్‌లో జరిగిన పవర్‌లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్ ఈవెంట్‌లలో పుల్లయ్య మూడు గోల్డ్ మెడల్ సాధించగా వీరన్న రెండు సిల్వర్ మెడల్స్ దక్కించుకున్నారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను గురువారం సాయంత్రం రైల్వే స్టేషన్‌లో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షులు నాగేశ్వరరెడ్డి, తదితరులు అభినందించారు.